# తృప్తి



## చిట్టి కథ

ఆ జంక్షన్ ఎప్పుడూ సందడిగానే వుంటుంది. సాయంకాలం అయ్యేక ఆ వూళ్లో యువతరం అక్కడ సమావేశం అవుతుంది. కాలేజీ చదువులతో బుర్రలు వేడెక్కిపోయినవాళ్ళూ, ఉద్యోగాల వేటలో అలసిపోయినవాళ్ళూ, రోజంతా డ్యూటీచేసి విసిగిపోయిన వాళ్ళూ ఆ జంక్షన్‌లో గుంపులు గుంపులుగా చేరి గుసగుస లాడుకుంటారు.

ఓరోజు సాయంత్రం వచ్చేపోయే వాహనాలతో ఆ జంక్షన్ రద్దీగా వున్నప్పుడు, ఓ అడుక్కు తినే ముసల్ది రోడ్డుకి అటునుండి ఇటు రావడానికి ప్రయత్నం చేస్తూంది. వయసు మళ్లిన కారణంగా, తొందరగా నడిచే ఓపికలేక అడుగు ముందుకు వెయ్యడానికి ఆమె భయపడుతూంది. జంక్షన్‌లో గుమిగూడిన కుర్రకారు చాలాసేపటి నుండీ ఆమె పడుతున్న అవస్థ చూస్తూ వున్నారు. కానీ, ఎవరూ కూడ సాహసించి రోడ్డు దాటడంలో ఆ ముసలిదానికి సహాయం చెయ్యలేదు. అడుక్కునే ముసలిదాన్ని ఆదుకోవడానికి వాళ్లకి 'కాంప్లెక్స్' అడ్డమొచ్చింది. అంచేత ఎవరిమట్టుకు వారు ఆ ముసలిదాన్ని చూడనట్టే ప్రవర్తించారు. రోడ్డు మీద నడిచి వెళ్ళే ఆడపిల్లల్ని అల్లరిచేస్తూ ఆ ఆనందాన్ని అనుభవిస్తున్నారు.

ఈ లోపల ముసల్ది ఎలాగో మెల్లగా కాళ్లీడ్చుకుంటూ సగం రోడ్డు దాటేసింది. 'హమ్మయ్య! ఫర్వాలేదు. ఇవతలకొచ్చేసినట్లే' అనుకుని మరో నాలుగు అడుగులు ముందుకి వేసేసరికి 'రఁయ్' మని ఓ రిక్షా వచ్చి ముసలిదాన్ని గుద్దేసి 'కుయ్యోఁ' మని ఓ మూలకి ఒరిగిపోయింది. రిక్షావాడు ముందుకి పడబోయి నిలదొక్కుకుని నిలబడిపోయాడు. రోడ్డుకి అడ్డం పడిన ముసలిదాన్ని వాడు బూతులు తిట్టడం మొదలుపెట్టాడు. ఇంతలో రోడ్డువార ఒరిగిపోయిన రిక్షాలోనుండి వయసులో వున్న ఓ అందాల చిన్నది ఒళ్లంతా ఒయ్యారం ఒలికిస్తూ బయటికి వూడిపడింది. ఆ చిన్నదాని కష్టం చూసి జంక్షన్‌లో పోగయిన కుర్రకారంతా వెంటనే ఆమె చుట్టూ వచ్చి చేరారు. 'అయ్యో పాపం!' అని సానుభూతి వచనాలు పలికేవాళ్ళు, 'దెబ్బలేమీ తగల్లేదు కదా!' అని పరామర్శించే వాళ్ళూ, 'సోడా తాగుతారా మేడమ్!' అని ఉదార స్వభావం నటించే వాళ్లూ.... ఆ ఒక్క క్షణంలో ఆమె మీద కొండంత అభిమానం కురిపించారు. చిన్నది, కట్టుకున్న చిలకపచ్చ నైలాన్ చీరను ఒకసారి సరిచేసుకొని, నవ్వుతూ అందరికీ 'థాంక్స్' చెప్పి మళ్ళీ వెళ్లి రిక్షాలో కూర్చుంది. వెనుకనుండి కుర్రకారు 'టాటాలు చీరియోలతో' రిక్షా ముందుకి సాగిపోయింది.

కుర్రకారు ఎప్పటిలా రోడ్డువారకి చేరి, 'ఏమి కళ్ళూ.... ఆహా ఏమీ నవ్వు'.... అని రిక్షాలో వెళ్లిపోయిన చిన్నదాని అందాన్ని నెమరువేసుకుంటున్నారు.

రోడ్డుకి మధ్య బోర్లా పడిపోయి కాళ్ళూ, చేతులు, నుదురు గీసుకుపోయి, రక్తం కారుతూ, బాధతో గిలగిలా కొట్టుకొని, అతికష్టం మీద పైకి లేచిన ముసలిదానివైపు మాత్రం పొరపాటున కూడ ఎవరూ కన్నెత్తి చూడలేదు.

—కవితాదేవి

## ముగ్గుల పోటీ

వనితలో మీరు ఎన్నో ముగ్గులు చూశారు. ఇతరత్రా కూడా ఎన్నో చూసివుంటారు. అవి కాకుండా, మీ ఊహా శక్తితో మీరు కొత్త ముగ్గు వెయ్యగలరా?

సంక్రాంతి – 'ముగ్గుల పండగ' గనక వచ్చే సంక్రాంతి సంచికలో (జనవరి 80) పోటీలో గెలుపొందిన మూడు ముగ్గులను ప్రచురిస్తాము.

### ఒక్కొ ముగ్గుకి పారితోషికం యాభై రూపాయలు

ముగ్గు వేసే విధానం: ముగ్గు ప్రారంభం, పూర్తి ముగ్గు – రెండు బొమ్మల్లో వివరించాలి. పూర్తి ముగ్గు సైజు 8"×6"కి తక్కువ కాకుండా వుండాలి. సిరా పూరకుండా వుండే కాగితం పైన, ఇండియన్ ఇంక్‌తో ముగ్గును – శుభ్రంగా అందంగా వెయ్యాలి. ముగ్గులు మాకు చేరవలసిన ఆఖరు తేదీ 24-11-79

పంపవలసిన చిరునామా: సంక్రాంతి ముగ్గుల పోటీ, వనిత, చందమామ బిల్డింగ్స్ మద్రాసు-26